సాక్షి
గుంటూరు
బుధవారం । 8 । అక్టోబర్ । 2025



## మర్యాదపూర్వక కలయిక

నరసరావుపేటటౌన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కల్యాణ్ చక్రవర్తిని పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.



## పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 75,430 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 0,430 క్యూసెక్కులు వదులుతున్నారు.



## నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: సుబ్బారాయుడి సన్నిధిలో నిత్యాన్నదానానికి బాపట్ల జిల్లా పేరావళికి చెందిన దాది వివేకానందస్వామి, సీతామహాలక్ష్మి దంపతులు రూ. 1,00,108ను విరాళంగా సమర్పించారు.

## న్యూస్‌రీల్

### నృసింహుని ఆదాయం రూ.48.45 లక్షలు



మంగళగిరిటౌన్: మంగళగిరిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి హుండీ కానుకలను మంగళవారం దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. ఎగువ, దిగువ సన్నిధులు, ఘాట్‌రోడ్‌లోని పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాలకు మొత్తం రూ.48,45,565 ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. గతంలో కంటే రూ.2,94,429 అధికంగా వచ్చినట్లు వివరించారు. లెక్కింపు కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా పొన్నూరు శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి వారి దేవస్థాన కార్యనిర్వహణాధికారి జి.వి.అమర్‌నాథ్ పర్యవేక్షించారు.

### పీజీ సోషల్ వర్క్ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ(పెదకాకాని):ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ కోర్సు రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు మంగళవారం విడుదల చేశారు. 13 మందికి 11 మంది ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునేవారు ఒక్కో పేపరుకు రూ.1,860 ఈనెల 17వ తేదీలోగా చెల్లించాలని సూచించారు.

**బీటెక్ సప్లిమెంటరీ ఫలితాలు..**

వర్సిటీ పరిధిలో బీటెక్ 3/4 మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను సీఈ శివప్రసాదరావు విడుదల చేశారు. 132 మందికి 87 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్ కోసం ఒక పేపరుకు రూ.2070 ఈనెల 17వ తేదీలోగా చెల్లించాలని సూచించారు.

### విద్యుత్ సబ్ స్టేషన్‌ను సందర్శించిన జేసీ



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి శివారు ఎన్నాదేవి వద్ద ఉన్న 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే మంగళవారం సందర్శించారు. 400 కేవీ సబ్‌స్టేషన్ అలియనేషన్‌లో భాగంగా ట్రాన్స్‌కోకు కేటాయించేందుకు ప్రతిపాదించిన 14.92 ఎకరాల స్థలాన్ని ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఆయనతోపాటు సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణాకాంతరెడ్డి, తహసీల్దారు కేఎస్ చక్రవర్తి తదితరులు ఉన్నారు.

### రంగా వర్సిటీలో వాల్మీకి జయంతి



గుంటూరురూరల్: గుంటూరు నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం జాయింట్ రిజిస్ట్రార్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### ఏఎన్‌యూ కాంట్రాక్ట్ అధ్యాపకులకు నోటీసులు

ఏఎన్‌యూ(పెదకాకాని): ఏఎన్‌యూలో కాంట్రాక్ట్ అధ్యాపకులకు నోటీసులు అందినట్లు విశ్వసనీయ సమాచారం. కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న నలుగురు, దూరవిద్యలో పనిచేస్తున్న ఇద్దరు అకడమిక్ కౌన్సెలర్లకు సెప్టెంబరు 29న ఈ మెయిల్ ద్వారా వర్సిటీ అధికారులు సమాచారం అందించారు. కొద్ది నెలల క్రితం 60 ఏళ్లు పూర్తయిన వారిని తొలగిస్తూ వర్సిటీ ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాలపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు సూచనల మేరకు సెప్టెంబరు 30 వరకు విధుల్లో కొనసాగారు. తాజాగా సెప్టెంబరు 29న వర్సిటీ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. ఇదే కేటగిరిలో సుమారు 11 మంది ఉండగా వారిలో ఆరుగురికి మాత్రమే నోటీసులు అందాయి.

# ఏ మాత్రం తగ్గిందేలే..



- కేంద్రం ప్రభుత్వం ఔషధాలపై జీఎస్టీ తగ్గించినా..
- ధరలు తగ్గించడం లేదని విమర్శలు
- పట్టించుకోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు
- ప్రజల జేబులకు చిల్లు

గుంటూరు మెడికల్: జీఎస్టీ 2.0 తగ్గింపు ప్రస్తుతం తారకమాత్రం అయింది. ఊరూవాడా భజాభజంత్రీలు పెట్టి ప్రచారం చేస్తున్నారు. గొప్ప మార్పు అంటూ కూటమి ప్రభుత్వం ఊదరకొడుతోంది. మందులపై భారీ ప్రభావం అంటూ ప్రచారం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఔషధ విక్రయాలకు అతి పెద్ద మార్కెట్‌గా గుంటూరుకు పేరుంది. కానీ ఇప్పటి వరకు ఔషధాల ధరలు ఏమాత్రం తగ్గలేదు. ఔషధ నియంత్రణ, పరిపాలన శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

**సెప్టెంబరు 22 నుంచి తగ్గింపు**

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0లో భాగంగా సెప్టెంబరు 22 నుంచే ధరల తగ్గింపు అమలులోకి వచ్చింది. అందులో భాగంగా కొన్ని మందులపై జీఎస్టీ పది శాతం, మరికొన్ని మందులపై ఐదు శాతం తగ్గింది. దసరాకు పలు కార్ల కంపెనీలు, ద్విచక్ర వాహనాల కంపెనీలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కంపెనీలు అధిక మొత్తంలో విక్రయాలు చేసినట్లు సమాచారం. కానీ ఔషధాల ధరలు మాత్రం ఏమాత్రం తగ్గలేదు.

**ఆస్పత్రుల షాపుల్లో మరీ దారుణం**

సాధారణంగా హోల్ సేల్ మార్కెట్‌లో పోటీ వలన ఖాతాదారులకు కొంతమేర రాయితీ ఇస్తుంటారు. గుంటూరు నాజ్ సెంటర్, గుంటగ్రౌండ్ ఏరియాలోని హోల్‌సేల్ మందుల షాపుల విక్రయాల్లో ఈ మార్పు కనిపిస్తోంది. ఆస్పత్రుల్లో సొంతంగా మందుల షాపులు ఏర్పాటు చేసుకున్న వారు మాత్రం నయాపైసా కూడా రాయితీ ఇవ్వరు. జీఎస్టీ తగ్గింపు రోజుల్లోనైనా ఏమైనా మార్పు తీసుకొచ్చే అవకాశాలు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తలుచుకుంటే చేయవచ్చు. కానీ తనిఖీలు చేసిన దాఖలాలు లేవు.

**రూ.కోట్లలో ఔషధాల విక్రయాలు**

గుంటూరు జిల్లాలో 2200 మెడికల్ షాపులు, పల్నాడు జిల్లాలో 1200 మెడికల్ షాపులు ఉన్నాయి. ప్రతిరోజూ రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. ప్రతినెలా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేసినట్లు రికార్డుల్లో రాసుకుంటున్నారు తప్ప, షాపులకు వెళ్లి తనిఖీలు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా యూనియన్ నాయకుల ద్వారా యూనియన్ కార్యాలయం ద్వారా నెలవారి మామూళ్లు తెప్పించుకుంటూ వారు ఓకే చెప్పిన షాపులకు అనుమతులు మంజూరు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**తగ్గింపు ఇలా..**

జీఎస్టీ తగ్గింపుల్లో భాగంగా నిత్యం వినియోగించే 99 శాతం ఔషధాలపై ఎమ్మార్పీ కంటే 6.25 శాతం తగ్గింపు రేటుతో మందులు విక్రయించాల్సి ఉంది. రోజువారి వినియోగించే బీపీ, షుగర్, జ్వరం మాత్రలు, నొప్పుల మాత్రలు, దగ్గుమందులు ఉన్నాయి. ఇవే కాకుండా క్యాన్సర్‌కు వినియోగించే 33 రకాల మందులపై 11 శాతం జీఎస్టీ తగ్గింపు అమలులోకి వచ్చింది. గతంలో 12 శాతం ఉండే జీఎస్టీని జీరో చేశారు. ఇతర ఔషధాలపై 12 శాతం జీఎస్టీ ఉంటే, అది ఐదు శాతానికి వచ్చింది.



**పాత స్టాక్ ఉందంటూ..**



సాధారణంగా మార్కెట్‌లో ఉన్న వస్తువులు ధరలు పెరిగాయంటూ వార్తా కథనాలు వెలువడగానే, తక్షణమే వ్యాపారులు పాత వస్తువులపై ఉన్న ఎమ్మార్పీ స్టిక్కర్లకు పెరిగిన ధరల స్టిక్కర్లు అంటించి పాత వస్తువులకు కొత్త రేట్లతో అమ్మకాలు చేసి లాభాలు గడిస్తుంటారు. అదే వస్తువులకు రేట్లు తగ్గాయంటే పాత స్టాకు నిల్వ ఉన్నంత వరకు తగ్గించిన రేట్లు ప్రకారం కాకుండా పాత ఎమ్మార్పీ ప్రకారం అమ్మకాలు చేస్తూ ఆ విధంగా కూడా లాభాలు గడిస్తూనే ఉంటారు. జీఎస్టీ 2.0లో భాగంగా ప్రతిరోజూ వినియోగంలో ఉండే ఔషధాల ధరలు తగ్గించాల్సిన మందుల షాపుల నిర్వాహకులు పాత ఎమ్మార్పీతోనే వినియోగదారులకు అమ్ముతున్నారు.

# ఏఎన్‌యూపై పచ్చమచ్చ

## అయినవారికి అందలం.. కానివారికి మంగళం

- అస్మదీయులకే పెద్ద పీట...
- ఇన్‌చార్జి పాలనలో అడ్డగోలు నియామకాలు
- ఉద్యోగాల కేటాయింపు, తొలగింపులో వివక్ష
- పట్టించుకోని చిన్న'బాబు'
- ఇష్టారాజ్యంగా వర్సిటీ అధికారులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఏఎన్‌యూలో పాలన అస్తవ్యస్తంగా మారింది. అస్మదీయులకు అడ్డగోలుగా ఉద్యోగాలు కల్పించడం.. అయిన వారికి నిబంధనలకు విరుద్ధంగా జీతాలు పెంచటం. ఇతరులను ఇష్టానుసారంగా ఉద్యోగాల నుంచి తొలగించడం.. ల్యాబ్ అసిస్టెంట్‌లకు అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలు కట్టబెట్టడం పరిపాటిగా మారింది. విద్యా శాఖ మంత్రి ఇలాకాలోని వర్సిటీ నిత్యం వివాదాల కేంద్రంగా మారుతున్న మంత్రికి పట్టడం లేదు. ఇన్‌చార్జి వీసీ పాలనలో అత్యంత అధ్వానంగా మారిన పూర్తి స్థాయి వీసీ నియామకం చేపట్టడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందింది.

**అన్యులకు మంగళం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇన్‌చార్జి వీసీ, వందలాది మంది ఉద్యోగులను తొలగించారు. నాన్ టీచింగ్ సిబ్బందిని పలు దఫాలుగా వంద మందిని పీకేశారు. ఏప్రిల్ ఒకటిన ఎటువంటి నోటీసులు లేకుండా ఐదుగురు దినసరి ఉద్యోగులను తొలగించారు. ప్రస్తుతం నాన్ టీచింగ్ సిబ్బందిని వయో నిర్ధారణ, వైద్య పరీక్షలు గత కొన్నిరోజులుగా నిర్వహిస్తున్నారు. దాదాపు 60 మంది వరకు ఉద్యోగులను తొలగించనున్నట్లు సమాచారం. 60 ఏళ్లు నిండిన కాంట్రాక్టు ఉద్యోగులు, అకాడమిక్ కౌన్సిలర్‌లను ఆరుగురికి రిలీవ్ నోటీసులు ఇచ్చారు. మొత్తం 11 మంది వరకు తొలగించనున్నట్లు సమాచారం.

**అస్మదీయులకు అందలం**

పచ్చవారికే ఉద్యోగం. 60 ఏళ్లు దాటిన వారిని ఒక వైపు తొలగిస్తూ.. 66, 68 ఏళ్ల వారికి మరోవైపు ఉద్యోగాలు ఇస్తున్నారు. పచ్చవారే అంటూ అనేక మంది నాన్‌టీచింగ్ ఉద్యోగులను కేటాయించారు.

- సాంఖ్యక శాస్త్రంలో ఇటీవల 68 సంవత్సరాల వయస్సు ఉన్న విశ్రాంత ఆచార్యుడికి రూ.60 వేల జీతంతో ఉద్యోగం ఇచ్చారు.
- బుద్దిస్ట్ స్టడీస్, లైబ్రరీ, కంప్యూటర్స్, దూరవిద్యలలో 65 సంవత్సరాలు పైబడిన వారికి రూ.60 వేల జీతంతో ఉద్యోగాలు కల్పించారు.
- సాంఖ్యక శాస్త్రంలో తమవారే అంటూ ఒక నాన్ టీచింగ్ ఉద్యోగి భార్యకు అదేవిభాగంలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగి కంటే అధిక జీతంతో ఉద్యోగం ఇచ్చారు.
- సోషియాలజీ, టూరిజం, ఇంజినీరింగ్ తదితర విభాగాల్లో అతిథి అధ్యాపకులను నియమించారు.
- ఇంజినీరింగ్ విభాగంలో ఒక ల్యాబ్ అసిస్టెంట్‌కు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అడ్డగోలుగా పదోన్నతి కల్పించారు. గతంలో ఇదే ఉద్యోగికి ప్రత్యేకంగా జీతం పెంచారు. ఇదే అర్హతతో ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్‌లో నలుగురు ఉన్నప్పటికీ వారిని కాదని సదరు వ్యక్తికే ప్రత్యేకంగా ఉద్యోగోన్నతి ఇచ్చారు.
- పరీక్షా భవన్‌లోని వివాదాస్పద అధికారి తన పేషీలోని దినసరి ఉద్యోగులను తీసివేయించి తన వర్గానికే చెందిన మహిళకు ఉద్యోగం ఇప్పించారు.
- అవినీతి అధికారిగా ముద్రవేసుకున్న ఒక అయ్యవారు మరో సామాజిక వర్గానికి చెందిన అతిథి అధ్యాపకుడి ఉద్యోగానికి మంగళం పాడించి. తన సామాజిక వర్గానికి చెందిన విశ్రాంత ఉద్యోగికి ఉద్యోగం ఇవ్వాలని వేధించి సాధించారు.

**ఇష్టానుసారంగా జీతాలు పెంపు..**

ఏప్రిల్ ఒకటిన ఐదుగురు దినసరి ఉద్యోగులకు ఎటువంటి నోటీసులు లేకుండా మధ్యాహ్నం పూట ఒకేసారి ఉద్యోగం నుంచి తొలగించారు. వారికి ఎటువంటి పీఎఫ్, గ్రాడ్యూటీని ఇంత వరకు చెల్లించలేదు. వారిలో మరికొందరు ఉద్యోగులు జీవన భృతి లేదు. మాబకాయిలు మాకు చెల్లించండి అంటూ ప్రదక్షిణలు చేసిన పట్టించుకునేవారు లేరు. వర్సిటీలోని తమ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు నాన్‌టీచింగ్ వారికి ప్రత్యేకంగా కమిటీ వేసి జీతాలు పెంచారు. ఒక విశ్రాంత ఆచార్యుడికి కారు విషయంలో ఉన్నతాధికారికి మరో అధికారికి మధ్య వివాదం ఏర్పడింది. ఒక విశ్రాంత ఆచార్యుడు వర్సిటీలో వచ్చ నియమాకాల్లో కీలకంగా మారాడు. వర్సిటీలోని ఆ వివాదాస్పద ఆచార్యుడి తీరుతో వర్సిటీ ప్రతిష్ట మసకబారుతోంది.

# వాల్మీకి మహర్షి ఆదర్శనీయుడు

**కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా**

గుంటూరు వెస్ట్: రామాయణ మహాకావ్యం ద్వారా మానవ సంబంధాలు, నైతిక విలువలు, కుటుంబ బాంధవ్యాలు, ఆదర్శ ప్రజాపాలన తదితర అంశాలను సమాజానికి అందించిన వాల్మీకి మహర్షి అని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ వై.లక్ష్మీశైలజ గౌడ్, గుంటూరు పార్లమెంట్ విశ్వబ్రాహ్మణ సాధికారిక కమిటీ అధ్యక్షుడు జె.నాగేశ్వరరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి మయూరి, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- కారు, ద్విచక్ర వాహనం ఢీకొని..
- మరో ముగ్గురికి గాయాలు
- వేములూరిపాడు వద్ద ఘటన
- 108 అందుబాటులో లేక ఆటోలో వైద్యశాలకు తరలింపు

ఫిరంగిపురం: కారు, ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పొనుగుపాడుకు చెందిన రత్నసాగర్(33) భార్య, ఇద్దరు పిల్లలతో కలసి గుంటూరు వెళ్లారు. గుంటూరు- కర్నూలు రాష్ట్ర రహదారిలో ఇంటికి తిరిగివస్తుండగా వేములూరిపాడు వద్ద గుంటూరు వైపు వెళ్తున్న ఇన్నోవా వాహనం ఢీకొట్టింది. ఘటనలో ఇన్నోవా రోడ్డుకు మరోవైపు వెళ్లింది. రత్నసాగర్‌తో పాటు భార్య, పిల్లలు గాయపడ్డారు. వీరితో పాటు అటువైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహన చోదకుడు గాయపడ్డారు. 108 అందుబాటులో లేకపోవడంతో ఆటోల్లో తరలిస్తుండగా రత్నసాగర్, గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం కారణంగా నిలిచిన ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.




ప్రమాదంలో మృతిచెందిన వారు

# ప్రమాదకరంగా బీబీసీ కెనాల్ డ్రాప్

- ఇప్పటి వరకు పది మంది ప్రాణాలు కోల్పోయారు
- డ్రాప్ వద్ద రక్షణ చర్యలు శూన్యం
- పట్టించుకోని కెనాల్స్ అధికారులు

నకరికల్లు: బెల్లంకొండ బ్రాంచి కెనాల్‌పై త్రిపురాపురం వద్ద ఉన్న డ్రాప్ ప్రమాదకరంగా మారింది. డ్రాప్ వద్ద నీటి ఉధృతి అధికంగా ఉండడంతో ఈత కొట్టేందుకు, వాహనాలు శుభ్రం చేసుకునేందుకు వచ్చే వారు ప్రమాదం బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటి వరకు పది మంది ప్రాణాలు కోల్పోయారు. అయినా అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. డ్రాప్‌కు ఇరువైపులా కట్ట బలహీనంగా ఉంది. యువకులు ఈత కొట్టేందుకు, ట్రాక్టర్‌లు, ఆటోలు శుభ్రం చేసుకునేందుకు వస్తుంటారు. అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీ డ్రైవర్‌లు, క్లీనర్ స్నానాలు చేసేందుకు దిగుతుంటారు. డ్రాప్ సమీపంలో లోతు ఎక్కువగా ఉండడం, నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడం, కట్ట మట్టి జారుతుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రదేశంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం గాని కట్ట బలహీనంగా ఉన్నచోట జారకుండా చూడడం, ప్రమాదాలు సంభవిస్తున్న చోట ఎవరూ దిగకుండా చూడడం వంటి నివారణ చర్యలు చేపట్టకపోవడం శోచనీయం.



# కొండ భూమిని వదలని కూటమి నేతలు

- రూ.20 కోట్ల విలువైన భూమి కబ్జా
- మసీదు స్థలంగా చూపించి బ్రిక్స్ ప్లాంటు ఏర్పాటుకు సన్నాహాలు
- గతంలో పేదల ఇళ్లు కూల్చి ఇప్పుడు దొడ్డిదారిలో కబ్జా
- అధికార పార్టీ పెద్దల ఆశీస్సులతోనే కబ్జాకు దారులు అంటున్న గ్రామస్తులు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

లాం(తాడికొండ): రాజధాని పరిధిలో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. కబ్జాలకు బరితెగించారు. విలువైన స్థలాలపై కన్నేశారు. ఏమాత్రం అవకాశం ఉన్నా సొంతం చేసుకునేందుకు కుట్ర చేస్తున్నారు. ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. తాడికొండ మండలం లాంలో కొండ పోరంబోకు భూమిని శ్మశానం కోసం రెండు ఎకరాలు ముస్లింలు రిజర్వు చేసుకున్నారు. ఆ స్థలాన్నే ఓ టీడీపీ మైనారిటీ నేత స్వాధీనం చేసుకున్నాడు.

వివరాలు.. గ్రామ సర్వే నంబర్ 199/ఏలో కొండ పోరంబోకు భూమి ఉంది. సుమారు 23 ఎకరాల్లో ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అయితే అందులో రెండు ఎకరాల పరిధిలో ముస్లింలు శ్మశాన వాటిక కోసం ప్రభుత్వ నిధులతో ప్రహరీ నిర్మించారు. తాజాగా కూటమి అధికారంలోకి రావడంతో టీడీపీ మైనారిటీ నేత కన్ను ఆ భూమిపై పడింది. అదే స్థలాన్ని పొక్లెయిన్‌తో గోడలు తొలగించి మరీ ఆక్రమణకు పాల్పడ్డాడు. ఆ భూమిని ఆక్రమించి ఓ భారీ బ్రిక్స్, నిర్మాణ రంగానికి అవసరమైన సిమెంటు సామగ్రి తయారీ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాడు. ఇప్పటికే అర ఎకరా భూమిలో బెడ్‌ల నిర్మాణం పూర్తి చేయగా అధికారికంగా కరెంటు కనెక్షన్ తీసుకునేందుకు మరో మోసానికి తెరలేపాడు.



లాంలో భూ కబ్జాకు గురైన కొండ పోరంబోకు



బ్రిక్స్ ప్లాంటు కోసం వేసిన బెడ్లు

**మసీదు స్థలంగా చూపి..**

అది మసీదుకు చెందిన స్థలంగా చూపించి వారి వద్ద నుంచి తాను లీజుకు తీసుకున్నట్లు ఓ దస్త్రం తయారు చేయించి ప్రభుత్వ భూమిలో కరెంటు మీటరు ఇవ్వాలంటూ దరఖాస్తు చేసుకున్నాడు. దీనికి గ్రామ పంచాయతీ ఎన్‌ఓసీ జారీ చేయాల్సి కోరాడు. ప్రభుత్వ స్థలానికి ఎన్‌ఓసీ జారీచేస్తే తాము ఎక్కడ ఇరుక్కుంటామో అనే మీమాంసలో తలలు పట్టుకుంటుండగా ఎన్‌ఓసీ జారీకి పట్టుబట్టి తీసుకున్నట్లు సమాచారం. సదరు భూమిని ఆక్రమణలో తనకు ఎవరైనా అడ్డుగా వస్తే అధికార పార్టీని అడ్డుపెట్టుకొని వారిపై తప్పుడు కేసులు బనాయిస్తానంటూ బెదిరింపులకు దిగడంతో ఫిర్యాదు చేసేందుకు కూడా ఎవరూ ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

**వీఆర్వో ఏమన్నారంటే...**

భూ కబ్జాపై లాం వీఆర్వో మధుసూదనరావును వివరణ కోరగా ఆ భూమి రికార్డు దాఖలా కొండ పోరంబోకు భూమిగానే నమోదై ఉంది. మసీదు స్థలంగా చెబుతున్నారు, పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఉన్నా...**

సదరు టీడీపీ నాయకుడిపై భూ కబ్జా వ్యవహారంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. తెనాలికి చెందిన కొందరు ఇక్కడ భూమిని కొనుగోలు చేసి అందులో నిర్మాణం చేసేందుకు రాగా వారిపై దౌర్జన్యం చేసి కొట్టిన కేసులో అట్రాసిటీ కేసులో నిందితుడుగా ఉన్నాడు. ఏమైనా పనులు అతడి అనుమతి లేకుండా చేస్తే అధికారులను ఇబ్బందులకు గురిచేసి దాడులు చేయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. తప్పుడు ఫిర్యాదులతో ఇటీవల వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులపై కేసులు నమోదు చేయించి, జైల్లో పెట్టించాడు. లాంలో లేబర్ కోఆపరేటివ్ సొసైటీపై తప్పుడు ఫిర్యాదులు, కేసులు వేసి వందలాది మంది కార్మికులకు ఉపాధి లేకుండా చేశాడు. అధికార పార్టీని, అధికార ప్రజా ప్రతినిధిని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్న టీడీపీ నాయకుడిపై తగిన చర్యలు తీసుకొని రూ.20 వేల కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా కోరల్లో నుంచి విడిపించాలని పలువురు కోరుతున్నారు.

# పరిశ్రమల మంజూరులో జాప్యం వద్దు

**కలెక్టర్ తమీమ్ అన్సారియా**

గుంటూరు వెస్ట్: జిల్లాలో పరిశ్రమలకు అనుమతుల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి(డి.ఐ.ఇ.పి.సి) సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖలు నిర్దేశిత సమయంలో మంజూరు అనుమతులు జారీ చేయాలని కోరారు. పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన జీవీఏ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని కోరారు. 'ఒక కుటుంబం- ఒక పారిశ్రామికవేత్త' కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబంపై దృష్టి సారించాలని తద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను గుర్తించి వారికి సరైన ప్రోత్సాహం అందించాలని చెప్పారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన పరంగా వచ్చిన ఏ అవకాశాన్ని వదులుకోవద్దని కలెక్టర్ సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం కింద 26 యూనిట్లను మంజూరు చేశామన్నారు. పీఎం విశ్వకర్మ పథకానికి 1,169 మంది అర్హత సాధించగా రూ.1.53 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగిందని వివరించారు. 4 ఎంఎస్ఎంఈ యూనిట్లకు పెట్టుబడి రాయితీగా రూ.75.47 లక్షలు, 6 యూనిట్లకు వడ్డీ రాయితీగా రూ.7.33 లక్షలు ఉందని తెలియజేయగా కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.ఎస్.కె.ఖాజావలి, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వి జయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, వేదికపై జేసీ అశుతోస్ శ్రీవాత్సవ

**తురకపాలెంలో స్థానికుల సహకారం అవసరం**

గుంటూరు రూరల్: తురకపాలెంలో అనారోగ్య పరిస్థితులు నియంత్రణకు స్థానికులు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా కోరారు. తురకపాలెంలో మంగళవారం పర్యటించారు. గ్రామస్తులతో రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో మాట్లాడుతూ గ్రామం ఆరోగ్య సంరక్షణకు నిలయం కావాలని ఆకాంక్షించారు. ప్రజలు తమ ఆరోగ్యస్థితి గతుల సమాచారం పక్కాగా అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరిని కాపాడటమే ధ్యేయంగా ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని హామీ ఇచ్చారు.



## పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 186

కొమ్ములు : 135బస్తాలు

| కనిష్ట : | గరిష్ట : (ధర రూ॥ల్లో) | మోడల్ : |
|---|---|---|
| 9,275 | 10,400 | 9,750 |

కాయలు : 51 బస్తాలు

| కనిష్ట : | గరిష్ట : | మోడల్ : |
|---|---|---|
| 9,2755 | 9,750 | 9,750 |

మొత్తం అమ్మకాలు : 139.50 క్వింటాళ్లు

– దుగ్గిరాల

వాణిజ్యం

## నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,200 గరిష్ఠం : రూ. 3,000

మోడల్ ధర రూ. 2,600

## మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)



| | |
|---|---|
| వచ్చిన బస్తాలు | 43,284 |
| అమ్మకాలు | 41,648 |
| నిల్వ | 7,909 |

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

| | |
|---|---|
| 334 | 10,500–14,500 |
| నంబరు–5 | 10,000–14,300 |
| 341 | 10,000–14,800 |

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

| | |
|---|---|
| 334 | 10,500–14,500 |
| నంబరు–5 | 10,000–14,000 |
| 341 | 10,000–15,000 |

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

| | |
|---|---|
| తేజ | 10,000 – 15,000 |
| బాడిగ–355 | 10,000 – 15,400 |
| దేవనూరు డీలక్స్ | 10,000 – 14,000 |
| ఆర్మూర్ | 9,800 – 12,000 |
| తాలుకాయలు | 6,000 – 6,900 |

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

| | |
|---|---|
| తేజ | 10,000–14,800 |
| బాడిగ – 355 | 10,000–15,200 |
| దేవనూరు డీలక్స్ | 10,500–14,200 |
| తాలు | 5,200 – 7,000 |

–కొరిటెపాడు (గుంటూరు)

# నయా కవులు... ఫేక్ డాక్టరేట్లు

'కవిగారూ...మీకు డాక్టరేట్ ఎవరిచ్చారు...? కొందరు కవులు/రచయితల వాట్సాప్ గ్రూపులో తెనాలికి చెందిన ఒకరు తన పేరుకు ముందు డాక్టర్‌ను చేర్చుకోవటంతో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ తీసుకున్న ఓ మహిళ వేసిన ప్రశ్న ఇది!

'ఫలానా సంస్థ రూ.150 చెల్లిస్తే ఇచ్చింది...' అంటూ సదరు కవిగారు సమాధాన మిచ్చారు.

'అలా ఎలా ఇస్తారు...ఏవిధంగా తీసుకుంటారు...నేను కేసు పెడతా'నంటూ ఆ మహిళ ఆగ్రహోదగ్రురాలైంది...ఇది జరిగి నాలుగురోజులైనా కాలేదు.



**తెనాలి:** దుగ్గిరాలకు చెందిన గుర్రం జాషువా కళాపరిషత్ నిర్వాహకుడు పెద్దీటి యోహానును ఆదివారం హైదరాబాద్‌లో వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. రవీంద్రభారతిలో ఏడుగురికి గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేసే కార్యక్రమంపై ఆకస్మిక దాడి చేసిన పోలీసులు, నకిలీ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకుని, అదుపులోకి తీసుకున్నారు. గుర్రం జాషువా పేరుతో కళాపరిషత్‌ను స్థాపించి ఏటా వర్ధంతి, జయంతి జరుపుతుడటం, రాష్ట్రవ్యాప్తంగా పలువురిని ఎంపిక చేసి రకరకాల పేర్లతో సత్కరిస్తుండటం ఆయనకు పరిపాటి. తన సంస్థను ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన సంస్థగా చెప్పుకుంటూ కొన్నేళ్లుగా గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేయసాగాడు. విజయవాడతో ఆరంభించి, హైదరాబాద్‌కు ఎదిగాడు. సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుని ఆసక్తి చూపిన వ్యక్తులనుండి డబ్బులు దండుకుని వారిని గౌరవ డాక్టరేట్లను ఎడాపెడా ఇచ్చేయసాగాడు. ఆ క్రమంలోనే హైదరాబాద్‌లో ఎవరో ఫిర్యాదుతో పోలీసుల చేతికిచిక్కాడు. అవార్డుల ప్రదానోత్సవానికి ప్రముఖులనూ ఆహ్వానించటం మరో టెక్నిక్! రవీంద్రభారతిలో యోహానును అరెస్టు చేసినపుడు వేదికపై ఉన్నవారు ప్రముఖులే! కవిగా, రచయితగా చలామణి అవుతూ చిన్నాచితకా టీవీ ఏపీసోడ్లు, సినిమాల్లో క్యారెక్టర్లు వేస్తూ వచ్చిన విశ్రాంత వెటరనరీ ఉద్యోగి యోహాను కళాపరిషత్ పేరుతో చేస్తున్న నిర్వాకం బట్టబయలు కావటంతో స్థానికులు ఆశ్చర్యపోయారు.



పెద్దీటి యోహాను

కొన్ని క్రైస్తవ సంఘాలు, చర్చి, మినిస్ట్రీలు మతసేవ, సమాజసేవ, బైబిల్ అధ్యయనంలో కృషి చేసిన వారికి గౌరవ డాక్టరేట్లు ఇస్తున్నాయి. ఇది విద్యార్హత కాదు. కొన్నిచోట్ల రిజిస్టర్డ్ బైబిల్ కళాశాలలు, థియాలజీ విశ్వవిద్యాలయాలు బైబిల్ అధ్యయనాలపై సాధారణ పాఠ్యప్రణాళికతో కూడిన డాక్టరేట్లు ఇస్తాయి. ఇవన్నీ మతపరంగా చెల్లుబాటు అయ్యేవి మినహా, యూజీసీ గుర్తింపు లేనివి. క్రైస్తవ సమాజంలో వీటికి గుర్తింపు ఉంటుంది. కొన్ని విదేశాలకు చెందిన సంస్థలు కూడా నగరాల్లో సభలను ఏర్పాటుచేసి గౌరవ డాక్టరేట్లు ఇస్తున్నాయి. అదలా ఉంచితే విద్య, కళా, సాహిత్య రంగాల పేరుతో ఇస్తున్న నకిలీ డాక్టరేట్లకు హీనపక్షం రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు డబ్బు వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. పేరుకోసం తాపత్రయపడే నయాకవులు/రచయితల్లో కొందరు డబ్బులు ఇచ్చేసి రాత్రికి రాత్రి పేరుప్రఖ్యాతలు సంపాదించుకోవాలని చూస్తున్నారు. వీరి ఆశకు తగినట్టే ఊరూపేరూ సంస్థలు పుట్టుకొస్తున్నాయి. సోషల్ మీడియాలో ప్రచారంతో ఇలాంటివారిని రెచ్చగొడుతున్నాయి వారి ఆశలను సొమ్ము చేసుకుంటూ పప్పుబెల్లాల్లా ఫేక్ డాక్టరేట్లను అందజేస్తున్నాయి.

## రాష్ట్రంలో కులగణన చేపట్టాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

**లక్ష్మీపురం:** తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో ఏ తరహాలో కులగణన చేశారో అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా చేసేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంటూరు కొత్తపేటలోని జిల్లా సీపీఐ కార్యాయలంలోని మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జనగణనలో కులగణన తక్షణమే చేపట్టాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలని కోరుతూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జనగణనలో కులగణన చేయడమే కాకుండా త్వరలో జరుగబోతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన 42 శాతం సీట్లు బీసీలకు కేటాయించడం జరిగిందన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా కులగణన చేపట్టాలని, అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ కులగణన జరిగితే బీసీలు ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కులగణన కోసం క్షేత్రస్థాయి నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, బీసీ నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, సీపీఐ నాయకులు జంగాల అజయ్‌కుమార్, ముస్లిం లీగ్ రాష్ట్ర అధ్యక్షుడు బషీర్ అహ్మద్, సీపీఎం జిల్లా నాయకులు పాశం రామారావు, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఖాజావలి ప్రసంగించారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

## తూర్పులో 104.2 మి.మీ. వర్షపాతం

**కొరిటెపాడు(గుంటూరు):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వలన గుంటూరు జిల్లాలో 11 మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు తూర్పులో 104.2 మిల్లీ మీటర్లు వర్షం నమోదు కాగా అత్యల్పంగా పెదనందిపాడు మండలంలో 2.8 మి.మీ. వర్షం పడింది. సగటున 24.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. గుంటూరు పశ్చిమలో 95.4 మి.మీ., తాడికొండ 52.8, మేడికొండూరు 48.2, తుళ్లూరు 42.2, మంగళగిరి 39.2, దుగ్గిరాల 18.6, తాడేపల్లి 13.6, ఫిరంగిపురం 11.6, పెదకాకాని మండలంలో 10.2 మి.మీ. చొప్పున వర్షం కురిసింది.

### గంజాయి కేసులో నిందితుడికి జైలు, జరిమానా

**తెనాలిరూరల్:** గంజాయి కేసులో నిందితుడికి జైలు శిక్ష జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్ తీర్పు నిచ్చారు. రూరల్ ఎస్‌ఐ ఆనంద్ అందించిన వివరాలు... పట్టణ ముత్తెంశెట్టిపాలేనికి చెందిన గంటినపల్లి పూర్ణచందు, సీబీఎన్ కాలనీకి చెందిన మొగిలి సాయి, గండికోట గోపి బైక్‌పై వస్తూ 2021 అక్టోబర్ 16న పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా పెదరావూరు జంక్షన్ వద్ద 500 గ్రాముల గంజాయితో పట్టుబడ్డారు. వీరిలో గోపి పరార్ కాగా, మిగిలిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. కొద్ది రోజులకు గోపిని అప్పటి సీఐ ఎం. సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ జి.ఏడుకొండలు అరెస్ట్ చేశారు. ఈ కేసు మంగళవారం విచారించిన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఎ.పవన్‌కుమార్, ముద్దాయిలు పూర్ణచందు, మొగిలి సాయిలకు మూడు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. మూడో నిందితుడు గోపిపై కేసు కొట్టివేశారు. ప్రసిక్యూషన్ తరపున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

### జాతీయ అథ్లెట్ రష్మిశెట్టికి ఘన సన్మానం



**లక్ష్మీపురం:** జాతీయ అథ్లెటిక్స్‌లో గుంటూరు రైల్వే డివిజన్‌కి చెందిన టీటీఐ(రైల్వే టికెట్ ఇన్‌స్పెక్టర్) రష్మిశెట్టి కాంస్య పతకం సాధించడం అభినందనీయమని గుంటూరు రైల్వే డీఆర్‌ఎం సుథేష్ఠ సేన్ అన్నారు. గుంటూరు పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్‌ఎం కార్యాలయంలో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రష్మిశెట్టి 64వ జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో జావెలిన్ త్రో విభాగంలో కాంస్య పతకం సాధించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ ప్రధానంగా జాతీయ క్రీడా పోటీలలో గుంటూరు రైల్వే డివిజన్ తరుపున జావెలిన్ త్రోలో పాల్గొని సత్తా చాటిన రష్మి శెట్టిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గుంటూరు రైల్వే డివిజన్ తరుపున క్రీడా, సాంస్కృతిక పోటీలలో ఆసక్తి కనబరిచిన వారికి ఎల్లప్పుడు తమ సహాయా సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు.

### ముగిసిన రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలు



**క్రోసూరు:** మండలంలోని బయ్యవరం గ్రామంలో పోలేరమ్మతల్లి, లక్ష్మీతిరుపతమ్మతల్లి గోపయ్యస్వామి ఆశీస్సులతో గత ఐదు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. విజేతల వివరాలు సీనియర్ విభాగంలో.. ప్రథమ బహుమతి హీరోహోండా డీలక్స్ బైక్‌ను ఏఎస్‌పీ సుంకి సురేంద్రరెడ్డి, సుంకి సాకేతరెడ్డి, సారికారెడ్డిల ఎడ్ల జత (హుజూర్‌నగర్, తెలంగాణ) గెలుచుకుంది. అదేవిధంగా ద్వితీయ బహుమతి రూ.60వేలు పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్ల జత (బాపట్ల జిల్లా, బల్లికురవ) గెలుచుకుంది. బాపట్ల జిల్లా, వేటపాలెం, అత్తోటశిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరిల ఎడ్ల జత రూ.40 వేలు, కృష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన గరికపాటి శ్రీధర్‌కు చెందిన ఎడ్లు రూ.30వేలు, ప్రకాశంజిల్లా బేస్తవారిపేట, జేసీ అగ్రహారం, లక్కు నాగశివ శంకర్‌కు చెందిన ఎడ్ల జత రూ.20 వేలు, తెలంగాణ రాష్ట్రం, మఠం పల్లి, గాయం శృజన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డిల ఎడ్ల జత రూ.15వేలు, గుంటూరు జిల్లా, కాకుమాను మండలం, కొండబాలవారిపాలెంకు చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షితా చౌదరిల ఎడ్ల జత రూ.12వేలు, కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం మల్లవల్లికి చెందిన అక్కినేని ముకుళ సత్యాచౌదరి ఎడ్ల జత రూ.10 వేలు గెలుచుకున్నాయి.

## వైఎస్ జగన్‌ను కలిసిన అంబటి మురళీకృష్ణ

వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిసి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను మురళీకృష్ణ వివరించారు.

–పొన్నూరు



## ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం పర్యటన

**తాడికొండ:** ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) బృందం రాజధాని అమరావతి పర్యటన వరసగా రెండో రోజు కొనసాగింది. విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో కమిషనర్ కె.కన్నబాబు, అడిషనల్ కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్, అమిలినేని భార్గవ తేజ్‌లతో ఏడీబీ– వాటర్– అర్బన్ డెవలప్మెంట్ సెక్టార్ బృందంలోని సభ్యులైన నోరియా సైటో(సీనియర్ డైరెక్టర్), మనోజ్ శర్మ(డైరెక్టర్), సంజయ్ జోషి(ప్రిన్సిపాల్ అర్బన్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్), అశ్విన్ హోసూర్ విశ్వనాథ్(సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్) సమావేశమయ్యారు. అనంతరం అమరావతి సచివాలయంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, పురపాలక– పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, పరిశ్రమలు– వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్ ఐఏఎస్‌లను కలిశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఐఏఎస్‌ను ఆయన చాంబర్‌లో ఏడీబీ బృందం కలిసినట్లు సీఆర్డీయే అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతి ప్రాజెక్టు పనులలో పురోగతి, ఏడీబీ అందజేస్తున్న ఆర్థిక సహకారం తదితర అంశాలను బృందంలోని సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృందం సభ్యులు

## జీవ ఉత్ప్రేరకాల తయారీపై అవగాహన

బ్రెజిల్ బృంద సభ్యులకు శిక్షణ

**కొల్లిపర:** ప్రకృతి వ్యవసాయం విధానాలు, జీవ ఉత్ప్రేరకాల తయారీపై బ్రెజిల్ బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం కోసం 25 మంది బ్రెజిల్ ప్రతినిధుల బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అత్తోట, దావులూరిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్ ఆఫీసర్ లక్ష్మనాయక్, బృందం సభ్యులకు బయో ఇన్పుట్‌ల తయారీ, ఘన జీవామృతం తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఏడాదిపాటు పంటలతో భూమిని కప్పి ఉంచడంతో పాటు ఏ గ్రేడ్, ఏ ప్లస్ గ్రేడ్, ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్, ఏటీఎం, పీఎండీఎస్ వంటి మోడల్స్ అనుసరించడం వలన కలిగే అనేక రకాల ప్రయోజనాలను బృంద సభ్యులకు అవగాహన కల్పించారు. దేశీ ఆవు, ప్రకృతి వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆవు పేడ, మూత్రంలో అధికంగా లభించే సూక్ష్మ జీవులు, భూమి సారాన్ని పెంచి పంటల ఆరోగ్యాన్ని కాపాడతాయని చెప్పారు. బృందం సభ్యులను ఆవు దగ్గరికి తీసుకువెళ్లి ప్రత్యక్షంగా పేడ, మూత్రం సూక్ష్మజీవుల ప్రాధాన్యంపై వివరించారు. అనంతరం స్వయంగా బృందం సభ్యులు బీజామృతం, ద్రవ, జీవామృతం, విత్తన గుళికల తయారీపై తర్ఫీదు ఇచ్చారు. దావులూరిపాలెంలో న్యూట్రి గార్డెన్, ఫుడ్ బాస్కెట్, ఆరోగ్యం, పోషకాహార కార్యకలాపాల లబ్ధిదారులను కలసి నిర్వహణ, ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు జాకీర్ హుస్సేన్, కృష్ణారావు, వాణిశ్రీ పాల్గొన్నారు.



అత్తోటలో సూక్ష్మజీవుల ప్రాధాన్యం గురించి తెలుసుకుంటున్న బ్రెజిల్ బృందం సభ్యులు

## మిర్చి సీజన్ నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ శ్రీనివాసరావు

**కొరిటెపాడు(గుంటూరు):** రాబోయే మిర్చి సీజన్ నాటికి మిర్చి యార్డు లోపల, బయట రైతులు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు కోరారు. మిర్చి సీజన్ ఏర్పాట్లపై మార్కెటింగ్ శాఖ అధికారులు, మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారులు, సూపర్ వైజర్లు, వేమెన్స్‌లతో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. తొలుత పలువురు ఎగుమతిదారులు మాట్లాడుతూ మిర్చి సీజన్‌లో సుమారు లక్ష మంది, అన్ సీజన్‌లో 50 వేల మంది యార్డుపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. సీజన్‌లో యార్డులోని అన్ని గేట్లు తెరిచేలా చూడాలన్నారు. కొనుగోలు చేసిన మిర్చిని తరలించేందుకు ట్రాన్స్‌పోర్టు సమస్య ఉందని, యార్డుకు ఇరువైపులా రోడ్లు విస్తరించాలని సూచించారు. లారీల యూనియన్ సమస్య అధికంగా ఉందని, కిరాయి ఎక్కువగా ఉందని, దానిని నియంత్రించేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు. పరిశ్రమలకు ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కింద మాకు సబ్సిడీపై భూమి కేటాయిస్తే గోదాములు నిర్మించుకుంటామని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాకుండా మిర్చిని ఆరబెట్టుకునేందుకు డ్రయర్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆర్‌జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సీజన్ ప్రారంభం నాటికి యార్డులో అన్ని మౌలిక వసతులు పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. ఈ నెల 12వ తేదీ(సోమవారం)న తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం మార్కెట్ యార్డును సందర్శించేందుకు ఎగుమతి, దిగుమతి వ్యాపారులు, యార్డు అధికారులు వెళ్లనున్నట్లు తెలిపారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ డీడీ దివాకర్, ఏడీఎం సత్యనారాయణ చౌదరి, యార్డు కార్యదర్శి ఎ.చంద్రిక, యార్డు అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, ఎగుమతి వ్యాపారులు జుగిరాజ్ భండారీ, కొత్తూరి సుధాకర్, తోట రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

**యడ్లపాడు:** అనుమానస్పదంగా ఓ యువకుడు ఆనవాళ్లు గుర్తుపట్టని విధంగా మృతి చెంది రోడ్డు పక్కన పడి ఉన్న ఘటన మండలంలో కలకలం రేగింది. మండలంలోని బోయపాలెం – సంగం గోపాలపురం గ్రామాల మధ్య మార్గంలో మంగళవారం ఈ దారుణ ఘటన వెలుగు చూసింది. పోలీసులు మొదట హత్యగా అనుమానించిన పోలీసులు ఘటనా స్థలి పరిశీలిన అనంతరం రోడ్డు ప్రమాదంగా ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బోయపాలెం నుంచి చెంఘీజ్‌ఖాన్‌పేట వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఓ యువకుడు ముఖం ఛిద్రమై మృత్యువాత పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న యడ్లపాడు పోలీసులు అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం దారుణంగా ఢీకొట్టడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్నందునే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడని, తల పూర్తిగా నుజ్జునుజ్జయి, ఆనవాళ్లను గుర్తించలేని పరిస్థితి ఏర్పడిందని భావిస్తున్నారు. మృతుడికి సుమారు 30 – 35 ఏళ్ల వయసు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. తెల్లని మేనిఛాయ కలిగి ఉన్నాడు. పసుపు రంగు టీషర్టు, నీలం రంగు షార్టు ధరించి ఉన్నాడు. ముఖ్యంగా, అతని ఎడమ కాలికి నల్ల దారం కట్టి ఉండటాన్ని గుర్తించారు. బహుశా ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కూలీ అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఆనవాళ్ల ఆధారంగా పోలీసులు మండలం పరిధిలోని అన్నివలస కూలీలు పనిచేసే నూలుమిల్లు, క్వారీలు, కంపెనీల్లో గాలింపు చేపట్టారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవాగారంలో భద్రపరిచినట్లు ఎస్‌ఐ టి.శివరామకృష్ణ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి వివరాలు తెలిసినవారు యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న యడ్లపాడు ఎస్‌ఐ శివరామకృష్ణ

### ఏపీ పీజీసెట్ పీడబ్ల్యూడీ కేటగిరిలకు కౌన్సెలింగ్ రేపు

**ఏఎన్‌యూ(పెదకాకాని):** ఏపీ పీజీ సెట్ ప్రవేశాల్లో భాగంగా పర్సన్ విత్ డిజేబిలిటీస్ (పీడబ్ల్యూడి) కేటగిరిలో అడ్మిషన్లకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కౌన్సెలింగ్ కో ఆర్డినేటర్ ఆచార్య ఆర్‌వీఎస్‌ఎస్‌ఎన్ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ఉదయం 10 గంటలకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ హెల్ప్ లైన్ సెంటర్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

### ఆంధ్రాలో సినిమాలు తీయవద్దు

నిర్మాతలకు 'మా– ఏపీ' వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా వినతి

**తెనాలి:** ఆంధ్రాలో సినిమాలు చిత్రీకరించవద్దని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్(మా–ఏపీ) వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా నిర్మాతలకు విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా తెనాలిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆంధ్రాలో తీసే సినిమాకు రూ.10 లక్షలు సబ్సిడీ చెల్లిస్తామని జీవో చేసినా ఒక్క సినిమాకు కూడా సబ్సిడీ ఇవ్వలేదని విమర్శించారు. అతితక్కువ నిర్మాణ వ్యయంతో రూపొందిస్తున్న 'భోజ్ పురి' సినిమాలకు సైతం సబ్సిడీ వెంటనే చెల్లిస్తున్నారని చెప్పారు. పదేళ్లుగా సినిమాలకు సబ్సిడీ చెల్లించని రాష్ట్రాలున్నాయా? అని ప్రశ్నించారు. ఆంధ్రాలో సినీపరిశ్రమ అభివృద్ధి గురించి ఒంటరిపోరాటం మినహా ఆశించిన స్పందన ప్రభుత్వం నుంచి రావటం లేదన్నారు. పరిశ్రమ గురించి పట్టించుకునే పరిస్థితిలో ప్రభుత్వం ఉంటే ఒక రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి విధివిధానాలను ప్రకటించేదని పేర్కొన్నారు.

## ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన బాలబాలికల జట్లతో ఉపాధ్యాయులు

**చిలకలూరిపేట:** చిలకలూరిపేట ఏఎంజీ పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం అండర్–19 బాలురు, బాలికల ఉమ్మడి గుంటూరు జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి సుమారు 80 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల హెచ్‌ఎం కృపాదానం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరరాఘవయ్యలు ప్రారంభించిన ఈ క్రీడా పోటీలను ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్‌ఎఫ్ కార్యదర్శి నరసింహారావు, సహాయ కార్యదర్శి పద్మాకరరావు పర్యవేక్షించారు.

**ఎంపికైన బాలురు జట్టు:** నాగశరత్, అస్రామ్, ఎండి అబ్దుల్ సమీర్, కె.జయరామ్, యశ్వంత్, యు హేమంత్రెడ్డి, జె అంకమ్మరావు, త్రినాథ్, ఎస్ వెంకటరాజేష్, ఎల్.లాకేష్, సీహెచ్ అక్ష, కె.వంశీకృష్ణ.

**బాలికల జట్టు:** ఇ.ప్రశాంతి, శ్రీ చందన, జి.అనిత, జి.మనీష, నేత్ర, పి.పావని, పి.హారిక, బి.శ్రీవల్లి, బి.రష్మి, కె.శ్రావ్య, జి.గౌతమి, పి.జ్యోతి చంద్రిక, పి.అమృతవర్షిణి. ఎంపికైన క్రీడాకారులను ఎస్‌ఎఫ్ కార్యదర్శి నరసింహారావు, సహాయ కార్యదర్శి పద్మాకరరావులతో పాటు పీఈటీలు, ఇతర పెద్దలు అభినందించారు.